పత్తి అమ్మకాల్లో సందేహాలా.. నివృత్తి చేసుకోండి

నేడు జేడీఎం శ్రీనివాస్‌తో




పత్తి కొనుగోళ్లకు భారత పత్తి సంస్థ (సీసీఐ) సిద్ధమవుతోంది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా రైతులు ఈ ఏడాది 5,13,289 ఎకరాల్లో పత్తి సాగు చేశారు. 4,10,632 మెట్రిక్ టన్నుల దిగుబడి వస్తుందని అధికారులు అంచనా వేస్తున్నారు. పత్తిలో తేమశాతం ఆధారంగా సీసీఐ ధర నిర్ణయిస్తుంది. ఈ నేపథ్యంలో గిట్టుబాటు ధర రావడానికి ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి.. అకాల వర్షాలతో రంగు మారిన పత్తి అమ్మకం ఎలా?.. సీసీఐ నిబంధనలు ఏమిటి? తదితర సందేహాలు రైతులను వేధిస్తున్నాయి. గురువారం కింది నెంబర్లకు ఫోన్ చేసి వాటిని నివృత్తి చేసుకోవచ్చు. మార్కెటింగ్‌శాఖ ప్రాంతీయ సంయుక్త సంచాలకుడు (జేడీఎం) వి.శ్రీనివాస్ సమాధానాలు ఇస్తారు.

– న్యూస్‌టుడే, ఎనుమాముల మార్కెట్

సంప్రదించాల్సిన చరవాణి నెంబరు
73307 33669, 8985131057
సమయం: ఉదయం 10 నుంచి 11 గంటల వరకు

ఏబీవీ డిగ్రీ కళాశాలకు స్వయం ప్రతిపత్తి హోదా

జనగామ, న్యూస్‌టుడే: జిల్లా కేంద్రంలోని ఆంధ్రభాషాభివర్ధిని ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు స్వయం ప్రతిపత్తి(అటానమస్) హోదా లభించింది. ఈ మేరకు విశ్వవిద్యాలయ గ్రాంట్ల సంఘం నుంచి సమాచారం అందిందని కళాశాల ప్రిన్సిపల్ ఎ.నర్సయ్య తెలిపారు. ఈ సందర్భంగా బుధవారం కళాశాలలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. 1975లో ప్రైవేటు కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటైన కళాశాల వచ్చే సంవత్సరం స్వర్ణోత్సవ సంవత్సరంలోకి అడుగు పెడుతున్న వేళ స్వయం ప్రతిపత్తి లభించడం కళాశాల చరిత్రలో మైలురాయిగా పేర్కొన్నారు. ఇక్కడి అవసరాలు, పరిస్థితులకు అనుగుణంగా విద్యార్థులకు ఉపయుక్తంగా ఉండే కోర్సుల ఎంపిక, సిలబస్ తయారీ, బోధన, పరీక్షల నిర్వహణను తీర్చిదిద్దుకునేందుకు ఇది ఉపకరిస్తుందన్నారు. గతంలో ఇక్కడ పనిచేసి బదిలీపై వెళ్లిన అధ్యాపక బృందం, ప్రస్తుత అధ్యాపకులు, ఇతర సిబ్బంది సహకారంతో తాము చేసిన కృషి ఫలించిందన్నారు. విద్యార్థులు అపూర్వ అవకాశాన్ని వినియోగించుకుని, కళాశాలకు పూర్వవైభవాన్ని తేవాలని కోరారు. సమావేశంలో వైస్ ప్రిన్సిపల్ బండి రాజు, అధ్యాపకులు ఎస్.భవాని, నవీన రాణి, అనగాని శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.


ప్రత్యేక అలంకరణలో దుర్గామాత


కళాకారుల ప్రదర్శన


రథం ఊరేగింపులో భక్త జనం


బోడ్రాయి వద్ద మొక్కులు చెల్లింపు


ఒగ్గు కళాకారుల డప్పు దరువు



వైభవంగా దుర్గమ్మ ఉత్సవాలు

జనగామ టౌన్, న్యూస్‌టుడే: జనగామ పట్టణంలోని బతుకమ్మకుంట మైదానంలో ఉన్న దుర్గామాత దేవాలయ వార్షికోత్సవాలు అంగరంగ వైభవంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా మూడో రోజు బుధవారం విజయదుర్గామాత ఉత్సవ విగ్రహాన్ని భారీ ఊరేగింపు నిర్వహించారు. నెహ్రూ పార్కు నుంచి బస్టాండ్ చౌరస్తా మీదుగా దేవాలయం వరకు వేలాది మంది ప్రజలు ఈ వేడుకలో పాల్గొన్నారు. కళాకారులు ప్రదర్శించిన విన్యాసాలు ఆకట్టుకున్నాయి. ఒగ్గు కళాకారులు డప్పు చప్పుళ్లతో ఊరేగింపు మార్మోగింది. రాత్రి దుర్గమ్మకు వివిధ కుల సంఘాల ఆధ్వర్యంలో వేలాది మంది మహిళలు సమర్పించిన బోనాలు అద్భుతం ఆకట్టుకున్నాయి. విద్యుత్ దీపాల వెలుగులు.. అమ్మవారికి నిర్వహించే కార్యక్రమాలతో జనగామ పట్టణం సందడిగా మారింది. పట్టణ సీఐ దామోదర్ రెడ్డి ఆధ్వర్యంలో ఎస్సైలు రాజేష్, చెన్నకేశవులు, శ్వేత తదితరులు ప్రత్యేక బందోబస్తు చేపట్టారు.


బోనాలు తీసుకువెళ్తున్న మహిళలు

‘కడియంను ఓడించేందుకు ఇందిర వర్గం సిద్ధం’


మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే రాజయ్య

స్టేషన్‌ఘన్‌పూర్, న్యూస్‌టుడే : ఉప ఎన్నికలు వస్తే కడియం శ్రీహరిని ఓడించేందుకు ఆయన చేరిన కాంగ్రెస్ పార్టీకి చెందిన సింగపురం ఇందిరతో పాటు ఆమె వర్గం సిద్ధంగా ఉన్నారని మాజీ ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య వ్యాఖ్యానించారు. మండల కేంద్రంలోని భారాస కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. విలువల గురించి మాట్లాడే శ్రీహరి వాటిపై ఏమాత్రం గౌరవం ఉన్నా.. వెంటనే ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఓడగొట్టేందుకు భారాస వాళ్లు కాదు.. కాంగ్రెస్ శ్రేణులే సిద్ధంగా ఉన్నాయని పేర్కొన్నారు. ఎంపీ కావ్య తండ్రి వెంట వెళ్లకుండా.. స్వయం ప్రతిపత్తితో రాజకీయాలు చేయాలని.. అప్పుడే పైకి వస్తారని హితవు పలికారు. కార్యక్రమంలో నాయకులు మాజీ జడ్పీటీసీ సభ్యుడు మారపాక రవి, పార్టీ మండలాధ్యక్షుడు గణేష్, నాయకులు సురేష్ కుమార్, పొన్న రంజిత్, సంజీవ, తదితరులు పాల్గొన్నారు.

నేడు వ్యవసాయ మార్కెట్‌కు సెలవు

జనగామ, న్యూస్‌టుడే: జిల్లా కేంద్రంలోని దుర్గామాత ఆలయంలో నిర్వహిస్తున్న ఉత్సవాలను పురస్కరించుకొని నేడు(గురువారం) జనగామ వ్యవసాయ మార్కెట్‌కు సెలవు ప్రకటించారు. కార్మికులు, వ్యాపార వర్గాల విజ్ఞప్తిని అనుసరించి క్రయ విక్రయాలు ఉండబోవని, రైతులు గమనించి సహకరించాలని మార్కెట్ ప్రత్యేక శ్రేణి ఇన్‌ఛార్జి కార్యదర్శి శ్రీనివాస్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.



అసలేం జరుగుతోంది?

● మంత్రి కొండా సురేఖపై సొంత పార్టీ ఎమ్మెల్యేల అసంతృప్తి

రంగంపేట, న్యూస్‌టుడే

ఓరుగల్లు కాంగ్రెస్ రాజకీయం రోజురోజుకు వేడెక్కుతోంది. మంత్రి కొండా సురేఖపై సొంత పార్టీ ఎమ్మెల్యేలే అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. గత రెండు రోజులుగా కాంగ్రెస్ పెద్దలను కలిసి వరుస ఫిర్యాదులు చేయడం ఉమ్మడి జిల్లా కాంగ్రెస్‌లో చర్చనీయాంశంగా మారింది. కొన్ని నెలలుగా ఇది అంతర్గతంగా సాగినా ఇటీవల జరిగిన ఘటనలతో బహిర్గతమైంది. మంగళవారం రాత్రి హైదరాబాద్‌లో ఏఐసీసీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌ఛార్జి దీపాదాస్ మున్షిని ఎమ్మెల్యేలు, ఉమ్మడి జిల్లాకు చెందిన ముఖ్యనాయకులు కలిశారు. బుధవారం ఉదయం టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్‌తో భేటీ అయ్యారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితోనూ మాట్లాడే ప్రయత్నం చేసినా సమయం లేకపోవడంతో వాయిదా పడింది. దిల్లీ నుంచి వచ్చాక కలిసే అవకాశం ఉంది.



పార్టీకి నష్టం..

● వరంగల్ పార్లమెంటు నియోజకవర్గ పరిధిలో మంత్రి సురేఖ ఒకవైపు, సొంత పార్టీకి చెందిన ఎమ్మెల్యేలు మరోవైపు ఉండడంపై కాంగ్రెస్ సీనియర్ నాయకులు సైతం అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

● మంత్రి వ్యవహరిస్తున్న తీరు, ఒంటెద్దు పోకడలతో పార్టీకి నష్టం వాటిల్లే ప్రమాదం ఉందని కాంగ్రెస్ ఎమ్మెల్యేలు అధిష్ఠానం పెద్దలకు వివరించినట్లుగా తెలిసింది. శాసనసభ నియోజకవర్గాల్లో స్థానిక ఎమ్మెల్యేలు సుప్రీం అని.. ఏదీ జరిగినా తామే కదా జవాబుదారీ అని టీపీసీసీ అధ్యక్షుడికి వివరించారు. ఎమ్మెల్యేలు, ఉమ్మడి జిల్లా నాయకులను సమన్వయం చేయాల్సిన బాధ్యత జిల్లా మంత్రులపై ఉందని.. ఇందుకు విరుద్ధంగా వ్యవహరించడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయని పేర్కొన్నారు..

● మంత్రి సురేఖ వాదన మరోలా ఉంది. తమను నమ్ముకున్న కార్యకర్తల కోసం ఉక్కు పిడికిలితో సమాధానం చెబుతామని బహిరంగంగా ప్రకటించారు. పరకాల నియోజకవర్గంతో చాలా అనుబంధం ఉందని, కార్యకర్తలపై దాడులు, పోలీసు కేసులు పెడితే చూస్తూ ఉండాలా? అని వ్యాఖ్యానించారు. గీసుకొండ పోలీసు స్టేషన్‌లో, ధర్మారంలో జరిగిన దాడులు, ఇతర విషయాలను సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి వివరించినట్లుగా తెలిసింది. పార్టీకి నష్టం కలిగించడం తన ఉద్దేశం కాదని తెలియజేసినట్లు సమాచారం.

త్వరలోనే సమావేశం

వరంగల్ ఉమ్మడి జిల్లా ప్రజాప్రతినిధులు, ముఖ్య నాయకులతో త్వరలోనే సమావేశం ఉంటుందని పార్టీ వర్గాల ద్వారా తెలిసింది. సీఎం రేవంత్‌రెడ్డి, టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్ గౌడ్ ఉమ్మడి జిల్లా నాయకులతో మాట్లాడే అవకాశాలున్నాయి. అందర్ని సమన్వయం చేసే బాధ్యత జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డికి అప్పగించారు.

భారీ వర్షాలతో పంటలకు ముప్పు


జనగామ: గానుగుపహాడ్‌లో నేలవాలిన వరి

జనగామ రూరల్, న్యూస్‌టుడే: పంటలు చేతికందే దశలో భారీ వర్షాలు అన్నదాతలను కలవరపెడుతున్నాయి. కుండపోత వానలు, గాలి బీభత్సంతో పంటలు దెబ్బతింటున్నాయి. జిల్లా వ్యాప్తంగా మంగళ, బుధవారం కురిసిన వానలతో వరి పంట నేలవాలగా, పత్తి పూర్తిగా తడిసి ముద్దగా మారింది. సకాలంలో వర్షాలు కురవక, సాగు నత్తనడకన సాగగా, చివరకు చేతికందే దశలో వరుణుడు ప్రతాపం చూపుతుండటంతో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. జిల్లాలో సగటున 12.8 మి.మీ వర్షపాతం నమోదైనట్లు జిల్లా అధికారులు వెల్లడించారు.

జిల్లాలో పరిస్థితి ఇలా..: ప్రస్తుత వర్షాకాలంలో సాగులో జిల్లాలో వ్యాప్తంగా వరి 2.06 లక్షలు, పత్తి 1.16 లక్షల ఎకరాల్లో సాగయ్యాయి. గత 10 రోజుల క్రితం నుంచే వరి కోతలు ప్రారంభం కాగా, పత్తి సేకరణ దశలో ఉంది. ప్రస్తుతం కురుస్తున్న వానలకు ఇబ్బందికర పరిస్థితులు ఎదురవుతున్నాయి. దీనికి తోడు యంత్రాల ఖర్చు రెండింతలుగా పెరగనుంది. పత్తి తడిసి గింజలు మొలకలు రావడం, కాయలు కుళ్లిపోతుండటంతో మద్దతు ధరపై ప్రభావం చూపుతుందని కర్షకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.


ఎర్రగొల్లపహాడ్‌లో తడిసి ముద్దగా మారిన పత్తి

నమోదైన వివరాలిలా..

● మండలం	● కురిసిన వర్షాపాతం మి.మీ.లో
జనగామ	29.8
బచ్చన్నపేట	29.3
స్టేషన్‌ఘన్‌పూర్	29.3
పాలకుర్తి	26.3
రఘునాథపల్లి	20.3
దేవరుప్పుల	20.3
నర్మెట్ట	9.5
జఫర్‌గఢ్	5.8
తరిగొప్పుల	5.8
లింగాలగణపురం	5.0

సీఎం కప్ క్రీడా జ్యోతికి ఘనస్వాగతం


క్రీడాజ్యోతి ర్యాలీని ప్రారంభిస్తున్న కలెక్టర్ రిజ్వాన్‌బాషా, జ్యోతితో ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి

జనగామ టౌన్, న్యూస్‌టుడే: త్వరలో రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించనున్న సీఎం కప్-2024 సంబంధించిన క్రీడాజ్యోతికి జనగామలో బుధవారం రాత్రి ప్రజాప్రతినిధులు, అధికారులు ఘనస్వాగతం పలికారు. యశ్వంతాపూర్ నుంచి జనగామ ఆర్టీసీ చౌరస్తా వరకు ర్యాలీ సాగింది. ఈ ర్యాలీలో పాల్గొన్న స్థానిక ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి, జిల్లా కలెక్టర్ రిజ్వాన్‌బాషా మాట్లాడుతూ.. సీఎం కప్ పోటీల్లో గ్రామీణ ప్రాంతాల నుంచి ఎక్కువ మంది పాల్గొనేందుకు గాను ఈ ర్యాలీలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో డీసీపీ రాజమహేంద్రనాయక్, మున్సిపల్ ఛైర్‌పర్సన్ పి.జమున, ఆర్డీవో కొమురయ్య, యువజన క్రీడలు జిల్లా అధికారి వెంకట్‌రెడ్డి, కార్మిక శాఖ అధికారి కుమారస్వామి, అధికారులు, విద్యార్థులు, కళాకారులు పాల్గొన్నారు.

సన్నాలకు షరతులు లేకుండా బోనస్


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శ్రీహరి

లింగాలఘనపురం, న్యూస్‌టుడే : మన రాష్ట్ర రైతులు కొనుగోలు కేంద్రాల్లో విక్రయించే సన్నరకం వడ్లకు మద్దతు ధర రూ.2320తో పాటు, షరతులు లేకుండా క్వింటాకు రూ.500 చొప్పున ప్రభుత్వం బోనస్ చెల్లిస్తుందని ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. వనపర్తిలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని అదనపు కలెక్టర్ రోహిత్‌సింగ్‌తో కలిసి బుధవారం ప్రారంభించారు. డీఆర్డీఏ పీడీ వసంత అధ్యక్షతన సమావేశంలో మాట్లాడారు. ప్రతి కొనుగోలు కేంద్రంలో సన్నాలకు, దొడ్డు ధాన్యానికి వేర్వేరుగా స్థలాలు కేటాయిస్తున్నట్లు తెలిపారు. పంట విక్రయించిన రెండు మూడు రోజుల్లో డబ్బులు రైతుల ఖాతాల్లో జమవుతాయని చెప్పారు. లేదంటే తన దృష్టికి తేవాలన్నారు. 43 లక్షల మంది రైతులకు రూ.30 వేల కోట్ల పంట రుణాలు మాఫీ చేసిన ఏకైక ప్రభుత్వం తెలంగాణ ప్రభుత్వం అన్నారు. ఇప్పటికే రూ.18 వేల కోట్ల పంట రుణాలు మాఫీ చేశామని, మరో నాలుగైదు నెలల్లో రూ.2లక్షల పైగా ఉన్న పంట రుణాల మాఫీ కోసం మార్గదర్శకాలు వస్తున్నాయని చెప్పారు. సమావేశంలో డీఏవో రామారావు, డీసీఎస్‌వో సరస్వతి, డీఆర్డీఏ డీపీఎం రాజేంద్రప్రసాద్, ఏపీడీ శ్రీనివాస్, సివిల్ సప్లై మేనేజర్ హాతిరామ్, ఏసీపీ భీంశర్మ పాల్గొన్నారు.

బ్యాక్‌లాగ్ విద్యార్థులకు అవకాశం

విద్యానగర్, న్యూస్‌టుడే: కేయూ పరిధిలోని డిగ్రీ, పీజీ బ్యాక్‌లాగ్ విద్యార్థులకు రాత, ప్రయోగ, సెమినార్ తదితర పరీక్షలు 2024-25 విద్యా సంవత్సరం కాలపరిమితికి సంబంధించి క్లియర్ చేయడానికి అవకాశం కల్పించారు. ఈమేరకు రిజిస్ట్రార్ ఆచార్య పి.మల్లారెడ్డి బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. కేయూ పరిధిలోని కళాశాలల విద్యార్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలన్నారు.

కొత్త ఉపాధ్యాయులకు స్వాగతం


విద్యార్థులు చప్పట్ల మధ్య వస్తున్న వేణుగోపాల్

కొత్తగా నియమితులైన ఉపాధ్యాయులకు పాఠశాలలోని సహ ఉపాధ్యాయులు, విద్యార్థులు ఆత్మీయంగా ఆహ్వానం పలికారు. స్టేషన్‌ఘన్‌పూర్ మండలంలోని చాగల్లు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సాంఘికశాస్త్ర ఉపాధ్యాయునిగా నియామకమైన చిదురాల వేణుగోపాల్‌కు ఇలా పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు. తాను గతంలో పంచాయతీ కార్యదర్శిగా పని చేశానని.. ఉపాధ్యాయ వృత్తిలోకి రావడం ఆనందంగా ఉందని సంతోషం వ్యక్తం చేశారు.

– ఈనాడు,హనుమకొండ– న్యూస్‌టుడే స్టేషన్‌ఘన్‌పూర్

జోరుగా సీతాఫలాల అమ్మకాలు


జనగామలోని వరంగల్-హైదరాబాద్ జాతీయ రహదారిపై సాగుతున్న విక్రయాలు

బచ్చన్నపేట (జనగామ), న్యూస్‌టుడే: తెలంగాణ ఆపిల్‌గా పేరొందిన సీతాఫలం క్రయవిక్రయాలు జనగామ జిల్లాలో జోరుగా సాగుతున్నాయి. రోజుకు రూ.లక్షల్లో అమ్మకాలు జరుగుతున్నాయి. ప్రస్తుతం గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి పనులు నిలిచిపోవడంతో పల్లె వాసులు కుటుంబ సభ్యులతో కలిసి అడవిబాట పడుతూ కాయలను తెంపి, ప్రధాన రహదారులపై అమ్ముతున్నారు. ధర ఎక్కువైనా తగిన పోషకాలు మెండుగా ఉండటంతో స్థానికులు, ప్రయాణికులు తీసుకోవడానికి ఆసక్తి చూపుతున్నారు.

ధర ఎక్కువైనా.. మక్కువతో..

జనగామ, చేర్యాల, బచ్చన్నపేట, నర్మెట్ట తదితర మండలాల నుంచి జిల్లా కేంద్రంలోని ఏరియాసుపత్రి వద్ద ఉన్న మార్కెట్, వరంగల్-హైదరాబాద్ జాతీయ రహదారిపైన విక్రయాలు జరుపుతున్నారు. గంప లెక్కన ఒక్కో దానికి రూ.400 నుంచి రూ.600 వరకు అమ్ముతుండగా, జనాలు తగిన బేరంతో తీసుకుంటున్నారు. బచ్చన్నపేట మండలం మన్‌సాన్‌పల్లి అటవీ ప్రాంతం నుంచి రెండు రోజులకోసారి వాహనంలో జిల్లా మార్కెట్‌కు తరలిస్తున్నారు. జిల్లా నుంచి హైదరాబాద్, మిర్యాలగూడ, కోదాడ, విజయవాడ, రాజమండ్రి, ఒంగోలు, గుంటూరు తదితర ప్రాంతాలకు కాయల సైజును బట్టి ఎగుమతి చేస్తున్నారు.

పోషకాలు మెండు..


ఈ ఫలంలో పోషకాలు కూడా మెండుగా ఉన్నాయి. వీటి ఆకులు మధుమేహాన్ని అదుపులో ఉంచడం, అధిక బరువు తగ్గించడంతో పాటు జలుబును కూడా నివారిస్తుంది. పండ్లలో కెరోటిన్, థయామిన్, రిబోఫ్లేవిన్, నియాసిన్, విటమిన్ సీ వంటి పోషకాలు సమృద్ధిగా ఉంటాయి. లోపలి గుజ్జు తింటే జీర్ణక్రియ కూడా వేగవంతంగా పనిచేస్తుంది. అందుకే పలు కంపెనీలు కూడా మందుల తయారీకి వీటిని వినియోగిస్తూ, దిగుమతి చేసుకుంటున్నారు.

గ్రామీణ రహదారులకు రూ.15 కోట్లు మంజూరు

జనగామ, జనగామ టౌన్, న్యూస్‌టుడే: జనగామ నియోజకవర్గ పరిధిలోని ముఖ్యమైన మూడు గ్రామీణ రహదారుల అభివృద్ధికి రూ.15 కోట్లు మంజూరయ్యాయని జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి, డీసీసీ అధ్యక్షుడు, నియోజకవర్గ ఇన్‌ఛార్జి కొమ్మూరి ప్రతాప్‌రెడ్డిలు బుధవారం వేర్వేరు ప్రకటనల్లో తెలిపారు. బచ్చన్నపేట మండలంలో బండనాగారం నుంచి కట్కూరుకు 5 కిలోమీటర్ల రోడ్డుకు రూ.5.80 కోట్లు, జనగామ మండలం సుందరయ్యనగర్‌లో 3 కిలోమీటర్ల రోడ్డుకు రూ.3.74 కోట్లు, మద్దూరు మండలం లద్నూరు నుంచి వంగపల్లికి 5.20 కిలోమీటర్ల రోడ్డుకు రూ.5.86 కోట్లు మంజూరైనట్లు పేర్కొన్నారు. ప్రజల అవసరాన్ని గుర్తించి నిధులు మంజూరు చేసినందుకు మంత్రి సీతక్కకు, కొమ్మూరికి ఆ పార్టీ నాయకులు వేరొక ప్రకటనలో కృతజ్ఞతలు తెలిపారు.



ఇదేందయ్యా ఇది..



జనగామ జిల్లా పాలకుర్తి నియోజకవర్గ కేంద్రం శివారులోని విద్యుత్తు సబ్‌స్టేషన్‌కు కూతవేటు దూరంలో ఉన్న ప్రధాన విద్యుత్తు లైన్‌కు పిచ్చి తీగలు అల్లుకున్నాయి. ఏకంగా 10 అడుగుల మేర చుట్టుకోవడంతో విద్యుత్తు తీగలు ప్రమాదకరంగా వేలాడుతూ, తెగిపోయేలా న్నాయి. వాటిని తొలగించి, ముందస్తు ప్రమాదాన్ని నివారించాలని స్థానిక రైతులు, ఆయా మార్గంలో వెళ్లే ప్రయాణికులు కోరుతున్నారు. ఈ విషయమై విద్యుత్తు ఏఈ రణధీర్‌ను వివరణ కోరగా.. తొలగించేలా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

– న్యూస్‌టుడే, పాలకుర్తి

నలుపు వరి.. ఆరోగ్య సిరి



చుట్టూ పచ్చని పొలాలు.. మధ్యలో నల్లగా ఉన్న పంటను చూస్తే తెగులు సోకిందని అనుకుంటే పొరపాటే.. జయశంకర్ భూపాలపల్లి జిల్లా మొగుళ్లపల్లి మండలం మొట్లపల్లిలో 15 గుంటలు విస్తీర్ణంలో మహిళా రైతు కొప్పుల కోమల బ్లాక్ రైస్ సాగు చేశారు. తన కుమారుడు బెంగళూరులో ఆయుర్వేద డాక్టర్‌గా శిక్షణ పొందుతున్న క్రమంలో అక్కడి నుంచి తెచ్చిన వరి వంగడాన్ని తెచ్చి సాగు చేసినట్లు వివరించారు. ఆరోగ్యపరంగా పలు ప్రయోజనాలు ఉండటంతో పాటు సాగు సులువుగా చేయవచ్చని.. అందుకే బ్లాక్ రైస్ పండించేందుకు రైతులు ఆసక్తి చూపిస్తున్నారని వరంగల్ ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన కేంద్రం సహ సంచాలకులు రావుల ఉమారెడ్డి తెలిపారు.

– ఈనాడు, హనుమకొండ–న్యూస్‌టుడే, మొగుళ్లపల్లి

ప్రాణాలతో చెలగాటమా?



అసలే జాతీయ రహదారి... వాహనాలు వాయువేగంతో దూసుకెళ్తాయి. జనగామ జిల్లా రఘునాథపల్లి టోల్ ప్లాజా వద్ద వాహనంపై ప్రమాదకరంగా ప్రయాణం చేస్తూ ఇలా కనిపించారు. ముందూ వెనక ఎటువంటి ఆసరా లేకుండా ప్రయాణం చేస్తున్నారు. ప్రమాదవశాత్తు పడితే అంతేసంగతులు..

– ఈనాడు,హనుమకొండ

శిక్షణ పొందుతూ.. ప్రత్యక్షంగా వీక్షిస్తూ..



రామప్ప ఆలయంలో వాలంటీర్ల బృందం

వెంకటాపూర్, న్యూస్‌టుడే: యునెస్కో గుర్తింపు పొందిన రామప్పలో వరల్డ్ హెరిటేజ్ వాలంటీర్ల శిక్షణ రెండో రోజు కొనసాగింది. బుధవారం ఉదయాన్నే యోగా గురువు రాంబాబు ఆధ్వర్యంలో యోగాసనాలు వేయించారు. అనంతరం కాకతీయ హెరిటేజ్ ట్రస్టు కన్వీనర్ ప్రొఫెసర్ పాండురంగారావు వాలంటీర్లకు శిక్షణ తరగతులను తీసుకున్నారు. రామప్పకు యునెస్కో గుర్తింపు ఎలా వచ్చింది? ఆలయ నిర్మాణ శైలి ఎంటీ? కాకతీయులు వాడిన సాంకేతిక పరిజ్ఞానం ఎంటీ? ప్రపంచ స్థాయిలో ఇలాంటి సాంకేతిక పరిజ్ఞానం ఇంకెక్కడైనా ఉందా? గుర్తింపునకు ఎలాంటి కారణాలు దోహదపడ్డాయనే అంశాలపై పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. మధ్యాహ్నం ప్రొఫెసర్ దేవాప్రతాప్ ఆలయ నిర్మాణంలో వాడిన సామగ్రి, వాటి సేకరణ, ప్రత్యేకంగా ఆ సామగ్రినే ఉపయోగించడానికి గల కారణాలు, వాటికిచ్చిన ప్రాధాన్యం తదితర అంశాలపై అవగాహన కల్పించారు. శిక్షణ తరగతుల అనంతరం రామప్ప ఆలయానికి చేరుకుని శిక్షణలో తెలుసుకున్న విషయాలను స్వయంగా ఆలయంలో వీక్షించి వాలంటీర్ల సందేహాలను నివృత్తి చేశారు. ఆలయంలోని రాగిని, నాగిని శిల్పాలు, సాండ్‌బాక్స్ టెక్నాలజీ, కామేశ్వర, కాటేశ్వరాలయ నిర్మాణాలను స్వయంగా చూశారు. ఆలయ పరిసర ప్రాంతాల్లో సామూహికంగా ఫొటోలు దిగారు. కార్యక్రమంలో వరల్డ్ హెరిటేజ్ వాలంటీర్ శిక్షణ ఇన్‌ఛార్జి శ్రీధర్‌రావు, పర్యాటకశాఖ అధికారి సూర్యకిరణ్, పురావస్తు, పర్యాటక శాఖ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

యువజన సంఘాల నుంచి దరఖాస్తుల ఆహ్వానం

వరంగల్ క్రీడావిభాగం, న్యూస్‌టుడే: ఉమ్మడి వరంగల్ జిల్లాల పరిధిలో యువజన సంక్షేమ కార్యక్రమాలు నిర్వహించేందుకు యువజన సంఘాల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు నెహ్రూ యువ కేంద్రం ఉమ్మడి జిల్లా సమన్వయ అధికారి చింతల అన్వేశ్ బుధవారం తెలిపారు. యువజన సంఘాల్లోని సభ్యుల వయసు 18 నుంచి 29లోపు ఉండాలన్నారు. ఆసక్తి ఉన్న యువజన సంఘాలు నమోదు కోసం సభ్యుల ఆధార్‌కార్డు, సంఘం ప్రతులను హనుమకొండలోని నెహ్రూ యువకేంద్రం కార్యాలయంలో ఈ నెల 19లోపు సమర్పించాలన్నారు. సంక్షేమ కార్యక్రమాల నిర్వహణలో యువజన సంఘాలను భాగస్వామ్యం చేయడమే లక్ష్యమని సమన్వయ అధికారి తెలిపారు. మరిన్ని వివరాలకు 0870 2958776 సంప్రదించాలన్నారు.

చికెన్ ధరలు

(కిలో వెల రూపాయలలో)

వెన్‌కాబ్	
ఫాం:	126
రిటైల్:	148
డ్రెస్డ్:	215
స్కిన్‌లెస్:	244

పత్తి కొనుగోళ్లకు సర్వం సిద్ధం

● కనీస మద్దతు ధర రూ.500 పెంపు

● మార్కెటింగ్ సంయుక్త సంచాలకుడు ఉప్పల శ్రీనివాస్

పత్తి కొనుగోలు సీజన్ ప్రారంభమైంది. ఇప్పటికే వరంగల్ ఎనుమాముల మార్కెట్‌కు అన్నదాతలు తెల్లబంగారంతో రావడం ప్రారంభమైంది. దీపావళి నాటికి విక్రయాలు జోరందుకుంటాయి. ఈ క్రమంలో మార్కెటింగ్ శాఖ పత్తి కొనుగోళ్లకు చేస్తున్న ఏర్పాట్లు ఎలా ఉన్నాయి? ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా సీసీఐ ఎన్ని కొనుగోలు కేంద్రాలను నోటిఫై చేసింది? విపణికి సరకు ఏ మేరకు వస్తోంది? తదితర వివరాలతో వరంగల్ మార్కెటింగ్ శాఖ సంయుక్త సంచాలకుడు ఉప్పల శ్రీనివాస్‌తో సోమవారం 'ఈనాడు' ముఖాముఖి నిర్వహించింది. ఆ వివరాలు.

ఈనాడు, వరంగల్, ఎనుమాముల మార్కెట్, న్యూస్‌టుడే



ముఖాముఖి

? పత్తి రైతులు సరకుతో మార్కెట్‌కు రావడం ప్రారంభమైంది. ఈసారి కనీస మద్దతు ధర ఏ మేరకు పెరగనుంది?

✔ దసరా పండగ ముగియడంతో రైతులు పెద్ద మొత్తంలో పత్తి పంటతో వరంగల్ ఎనుమాముల మార్కెట్‌కు వస్తున్నారు. ఈసారి వారికి ధర లాభసాటిగా ఉంటుందని భావిస్తున్నాం. కనీస మద్దతు ధర రూ.500 పెరిగింది. కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ) క్వింటాకు మద్దతు ధర రూ.7521 చెల్లించనుంది.

? సీసీఐకు విక్రయిస్తే రైతుల ఖాతాల్లో ఎన్ని రోజుల్లో డబ్బులు జమ వుతాయి?

✔ రైతులు ఆధార్ అథెంటిఫికేన్ చేసుకుని ఉంటే కొనుగోలు కేంద్రాల వద్ద పని సులువు అవుతుంది. ఆధార్‌తో లింక్ అవడం వల్ల పత్తి విక్రయించిన రెండు మూడు పని దినాల్లో డబ్బులు ఖాతాల్లో జమవుతాయి.

? సరకు రాక అంచనా గతేడాదికన్నా పెరిగిందా.. తగ్గిందా?

✔ ఇప్పటికే మేం సరకు రాకపై ఒక అంచనా రూపొందించుకున్నాం. గతేడాది 28.72 లక్షలు మెట్రిక్ టన్నులు వచ్చింది. ఈ ఏడాది సరకు రాక మరింత పెరుగుతుందని వ్యవసాయ శాఖ గణాంకాల ద్వారా స్పష్టమైంది. సుమారు 32.09 లక్షలు మెట్రిక్ టన్నుల పత్తి మార్కెట్‌కు వస్తుందని అంచనా వేశాం. ప్రస్తుతానికి ఎనుమాములకు కొద్ది మొత్తంలో మాత్రమే సరకు వస్తోంది. దీన్ని ప్రైవేటు వ్యాపారులు కొంటున్నారు. వరంగల్, సూర్యాపేట, నల్గొండ, ఆదిలాబాద్, ఖమ్మం, భువనగిరి తదితర జిల్లాల నుంచి అక్టోబరులో సరకు రావడం మొదలవుతుంది. నవంబరులో మిగతా జిల్లాల నుంచి పెద్ద మొత్తంలో వస్తుంది.

? పత్తి రైతులకు మార్కెటింగ్ శాఖ అన్ని సౌకర్యాలు కల్పిస్తోందా?

✔ రైతులకు సాంకేతికతను చేరువ చేసేందుకు ఒక వాట్సప్ నెంబర్ (8897281111) కూడా మా శాఖ కొత్తగా ప్రవేశపెట్టింది. అందులోకి రైతులు వెళ్లి 'హాయ్' అని టైప్ చేస్తే కావాల్సిన సమాచారం వస్తుంది. ఏ యే జిన్నింగ్ మిల్లులో ఎంత మంది విక్రయాల కోసం వేచిచూస్తున్నారనే వివరాలు తెలుసుకోవచ్చు. ఎనుమాముల మార్కెట్‌లో ఇప్పటికే తాగునీటి వసతి కల్పించాం. విద్యుత్తు సరఫరా, యార్డులను శుభ్రం చేసి పెడుతున్నాం. సీసీఐ కొనుగోలు కేంద్రాలపై కూడా మా సిబ్బంది పర్యవేక్షణ ఉంటుంది. రైతులు పెద్ద ఎత్తున రావడానికి ముందే అన్ని ఏర్పాట్లు చేయాలని ప్రభుత్వ ఆదేశాలు ఉన్నాయి. మా శాఖ మంత్రి, ఉన్నతాధికారులతో సమీక్ష సైతం పూర్తయ్యింది.

? మద్దతు ధర పెరిగిన నేపథ్యంలో రైతులు ప్రైవేటు వ్యాపారుల కన్నా సీసీఐకే ఎక్కువ పత్తిని విక్రయించే అవకాశం ఉంది. ఉమ్మడి జిల్లాలో ఎన్ని కేంద్రాలను నోటిఫై చేశారు?

✔ ఉమ్మడి జిల్లాలో 58 జిన్నింగ్ మిల్లులు ఉన్నాయి. ప్రస్తుతం 28 నోటిఫై చేశాం. త్వరలో వంద శాతం మిల్లులను అందుబాటులోకి తెస్తాం. రైతులు నేరుగా ఆ కేంద్రాలకు తీసుకొచ్చి పత్తిని విక్రయించవచ్చు. కనీస మద్దతు ధర కన్నా ఎక్కువ ధర వస్తే రైతులు బయట విక్రయించుకోవచ్చు. అప్పటి వరకు కొనుగోలు కేంద్రాలు కొనసాగుతాయి.

? పత్తిని మార్కెట్‌కు తీసుకొచ్చే క్రమంలో రైతులకు మీరిచ్చే సూచనలు ఏమిటి? తేమ శాతం ఎంత వరకు ఉంటే సీసీఐ కొనుగోలు చేస్తుంది?

✔ వచ్చేది చలికాలం కాబట్టి ఉదయం వేళ పత్తిపై తేమ ఎక్కువగా ఉంటుంది. అందుకే తొక్కడానికి సమయం తీసుకోవాలి. లేదంటే తేమ లోపల అలాగే ఉంటుంది.. రైతులు కోసిన వెంటనే తీసుకొస్తే మాయిశ్చర్ ఎక్కువగా నమోదవుతుంది. చాలా మంది రైతులు గ్రేడింగ్ చేయకుండా సరకును తీసుకురావడం వల్ల సీసీఐ వాళ్లు నిరాకరిస్తారు. గ్రేడింగ్ చేయడం మరవొద్దు. తేమ 8 నుంచి 12 శాతం వరకు ఉంటే సీసీఐ కొనుగోలు చేస్తుంది. కొనుగోలు కేంద్రాల్లో వే బ్రిడ్జ్ మీదున్న బరువును అన్నదాతలు సరిచూసుకోవాలి.

ఎంజీఎంలో అరుదైన శస్త్రచికిత్స

● మహిళా గొంతుపై థైరాయిడ్ గడ్డ తొలగింపు

ఎంజీఎం ఆసుపత్రి, న్యూస్‌టుడే: వరంగల్ ఎంజీఎం ఆసుపత్రిలో జనరల్ సర్జరీ విభాగం వైద్యులు అరుదైన శస్త్ర చికిత్సను విజయవంతంగా నిర్వహించి. . ఓ మహిళ ప్రాణాలు కాపాడారు. వైద్యాధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. హనుమకొండ జిల్లా హసన్‌పర్తి మండలానికి చెందిన జన్ను వరలక్ష్మి(46) గొంతుపై 25 సె.మీ. వెడల్పుతో మెడ చుట్టూ ఆక్రమించి ఉన్న థైరాయిడ్ గడ్డతో పదేళ్లుగా ఇబ్బంది పడుతున్నారు. మెదడుకు రక్తప్రసారం చేసే నరాలను గడ్డ చుట్టుముట్టడంతో ఆహారం మింగలేకపోతున్నారు. ఎన్ని ఆసుపత్రులు తిరిగినా. . హైదరాబాద్‌లోని పలు ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రులకు వెళ్లినా.. ఫలితం కనిపించలేదు. చివరికి హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రి వైద్యులు శస్త్రచికిత్స చేయడానికి రూ.5 లక్షల వరకు ఖర్చవుతుందన్నారు. కానీ ప్రాణాలకు హామీ ఇవ్వలేమని చెప్పారు. దిక్కుతోచని పరిస్థితుల్లో 10రోజుల క్రితం ఎంజీఎం ఆసుపత్రి జనరల్ సర్జరీ వైద్య విభాగానికి వచ్చారు. ప్రొఫెసర్ డా.శ్రీనివాస్‌గౌడ్ ఆధ్వర్యంలో వైద్య బృందం పరీక్షించింది. అన్నిరకాల పరీక్షల అనంతరం బుధవారం సుమారు 5 గంటల పాటు శస్త్రచికిత్స నిర్వహించారు.



బాధితురాలితో వైద్య బృందం

బాధితురాలి గొంతుపై 25సె.మీ. వెడల్పులో ఉన్న థైరాయిడ్ గడ్డను విజయవంతంగా తొలగించారు. ఈ శస్త్రచికిత్సలో ప్రొఫెసర్ శ్రీనివాస్‌గౌడ్‌తో పాటు డా.వినోద్‌కుమార్ దుస్సా, సీనియర్ రెసిడెంట్లు, పీజీ వైద్యులున్నారు. శస్త్రచికిత్స అనంతరం బాధితురాలు ఆరోగ్యంగా ఉందని వైద్యులు ధ్రువీకరించారు. కాగా ఇంత సంక్లిష్టమైన శస్త్రచికిత్సను ఎంజీఎం ఆసుపత్రిలో ఉచితంగా చేశారు. శస్త్ర చికిత్సలో పాల్గొన్న వైద్యులను ఎంజీఎం సూపరింటెండెంట్ డా.చిలుక మురళి అభినందించారు.

ఆర్టీసీ బస్సులకు అనుమతి లేదెందుకు?



వంతెన మీదుగా తిరుగుతున్న ప్రైవేటు వాహనాలు

హనుమకొండ నగరంలో ప్రధానమైన నయీంనగర్ నాలాపై వంతెన నిర్మాణం పూర్తైనా ఆర్టీసీ బస్సులు ఈ మార్గంలో తిరగడం లేదు. ఏటా వర్షాకాలం నాలా పొంగి కాలనీలను ముంచెత్తుతుండటంతో ప్రభుత్వం రూ.7.40 కోట్ల నిధులతో ఈ ఏడాది ఏప్రిల్ 5 నాలా విస్తరణ, వంతెన నిర్మాణం పనులకు శ్రీకారం చుట్టింది. దీంతో ఈ మార్గం గుండా రాకపోకలకు సాగించే ఆర్టీసీ బస్సులను దారి మళ్లించి నడిపారు. దీనికి అదనంగా టికెట్టుపై రూ.10 అదనంగా వసూలు చేస్తున్నారు. పనులు పూర్తై, ఆటోలు, స్కూల్ బస్సులు, ఇతర వాహనాలు తిరుగుతున్నా ఆర్టీసీ అధికారులు మాత్రం బస్సులను ములుగు రోడ్డు, పెద్దమ్మగడ్డ మీదుగానే తిప్పుతున్నారు. దీని కారణంగా ప్రయాణికులపై ఆర్థికంగా అదనపు భారం పడటమేకాకుండా.. కరీంనగర్, సిద్దిపేట, వేములవాడ, నిజామాబాద్ తదితర ప్రాంతాలకు వెళ్లేవారికి సమయం కూడా వృథా అవుతోంది. – న్యూస్‌టుడే, హనుమకొండ చౌరస్తా

అవిభక్త కవలలకు 22 ఏళ్లు

● సొంతగ్రామంలో పుట్టినరోజు వేడుకలు

దంతాలపల్లి, న్యూస్‌టుడే: దంతాలపల్లి మండలం బీరిశెట్టిగూడెం గ్రామానికి చెందిన అవిభక్త కవలలు వీణ, వాణి ఇరవై ఏళ్ల అనంతరం తమ సొంతింట్లో పుట్టిన రోజు వేడుకలను జరుపుకొన్నారు. మారగాని మురళి-నాగలక్ష్మి దంపతులకు రెండో సంతానంగా సూర్యాపేటలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో వీరు జన్మించారు. 13 ఏళ్ల పాటు నీలోఫర్ ఆసుపత్రిలోనే ఉన్నారు. అనంతరం స్టేట్‌హోంకు తరలించారు. అప్పటి నుంచి అక్కడే పుట్టిన రోజు వేడుకలు జరిగాయి. స్టేట్‌హోం సూపరింటెండెంట్లు సఫియాఖాన్, సోమలక్ష్మితో కలిసి హైదరాబాద్ నుంచి బీరిశెట్టిగూడెం చేరుకోగా ఈసారి తమ ఇంట్లో బుధవారం 22వ జన్మదినాన్ని జరుపుకొన్నారు. బంధువులు, గ్రామస్థులు హాజరయ్యారు. తల్లిదండ్రులు మాట్లాడుతూ ప్రభుత్వం తమను ఆదుకోవాలని, పిల్లలతో కలిసి ప్రతి జన్మదినాన్ని జరుపుకొనేలా అవకామివ్వాలని కోరారు. ప్రాథమికోన్నత పాఠశాల ఆవరణలో పలువురు వీరికి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.



కేక్ తినిపిస్తున్న వీణ-వాణి తల్లిదండ్రులు మురళి-నాగలక్ష్మి

మేడారం జాతరలో శాశ్వత ఏర్పాట్లకు కృషి



వనదేవతలకు కుటుంబసమేతంగా పూజలు నిర్వహిస్తున్న మంత్రి కొండా సురేఖ

మేడారం(తాడ్వాయి), న్యూస్‌టుడే: మా కుల దైవమైన సమ్మక్క, సారలమ్మను దర్శించుకోవడం సంతోషంగా ఉందని రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ అన్నారు. మంత్రి కుటుంబసమేతంగా బుధవారం మేడారం వచ్చి తన మనవడి పుట్టువెంట్రుకలు సమర్పించారు. అమ్మవార్లకు ఎత్తుబెల్లం, నూతన వస్త్రాలు, ఒడిబియ్యం సమర్పించి పూజలు చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. గత మహా జాతర సందర్భంగా కోరిన కోర్కెలు తీరినందుకు మేడారం వచ్చి మొక్కులు చెల్లించామన్నారు. మేడారాన్ని గతంలో కాంగ్రెస్ ప్రభుత్వమే ఎక్కువ అభివృద్ధి చేసిందన్నారు. ప్రస్తుతం కేంద్రంలో తమ ప్రభుత్వం ఉన్నట్లయితే జాతీయ హోదా దక్కి మరింత అభివృద్ధి చెందేదని తెలిపారు. రాబోయే జాతరనాటికి భక్తులకు అన్ని రకాల శాశ్వత ఏర్పాట్లు చేయించేందుకు కృషి చేస్తామన్నారు. రాష్ట్రం ఆర్థికాభివృద్ధి సాధించి ప్రజలకు మేలు జరగాలని దేవతలను వేడుకోవడం జరిగిందని పేర్కొన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ కొండా మురళీధర్‌రావు, డీఎఫ్‌వో రాహుల్‌కిషన్ జాదవ్, దేవాదాయశాఖ డీసీ శ్రీకాంత్‌రావు, తహసీల్దారు రవీందర్, ఎంపీవో శ్రీధర్‌రావు, ఆలయ కార్యనిర్వహణాధికారి రాజేంద్రం, పూజారుల సంఘం అధ్యక్షుడు సిద్ద బోయిన జగ్గారావు, తదితరులు పాల్గొన్నారు.


బమ్మెర పర్యాటకాభివృద్ధి పనులపై నీలినీడలు

పాలకుర్తి, న్యూస్‌టుడే

జనగామ జిల్లాలోని బమ్మెర, వల్మిడి, సోమేశ్వరాలయం, పాలకుర్తికి తరాల చరిత్ర ఉంది. ఇక్కడ ఎందరో మహానుభావులు, కవులు, కళాకారులు, పోరాటయోధులు పురుడుపోసుకున్నారు. అంతటి ప్రాధాన్యత ఉన్న ఈ ప్రాంతాలను పర్యాటకంగా అభివృద్ధి చేయాలని గత ప్రభుత్వం 2017లో సుమారు రూ.23 కోట్లు మంజూరు చేయగా, పనులు చేపట్టారు. వల్మిడి, పాలకుర్తిలో 90 శాతం మేర నిర్మాణాలు పూర్తి కాగా, బమ్మెరలో మాత్రం ఏళ్లుగా ఆగుతూ. . సాగుతూ.. వస్తున్నాయి.

40 శాతం మేర నిర్మాణ దశలోనే..

బమ్మెరలో సహజ కవి పోతన చారిత్రక ఆనవాళ్లు ఉన్న ప్రదేశంలోనే సుమారు 4 ఎకరాల స్థలంలో పర్యాటకాభివృద్ధి పనులు చేపట్టారు. 2019లో పోతన స్మృతివనంతోపాటు గ్రంథాలయం, అక్షరభ్యాస కేంద్రం, విడిది కేంద్రాలు, సమాధి, బావి పునరుద్ధరణ, ఆడిటోరియం తదితరాలు చేపట్టగా, అవి ఇంకా నిర్మాణ దశలోనే మగ్గుతున్నాయి. అలాగే రూ.3 కోట్లతో పోతన కాంస్య విగ్రహం ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నారు. అయితే కొన్నాళ్లుగా నిలిచిన పనులపై స్థానిక ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి, కలెక్టర్ రిజ్వాన్‌బాషాలు ఇతర శాఖల అధికారులతో పలుమార్లు సమీక్షించారు. చేసిన వాటికి బిల్లులు రాకపోవడమే ప్రధాన కారణంగా తెలుస్తోంది. ఇంకా 40 శాతం మేర పనులు పెండింగ్‌లో ఉన్నాయి. బమ్మెరను అభివృద్ధి చేస్తే పర్యాటకుల రాకతో ఆదాయం పెరిగే అవకాశాలు మెండుగా ఉన్నాయని ప్రజలు అభిప్రాయపడుతున్నారు. ఇప్పటికే సోమేశ్వరాలయం ఆ ఖ్యాతిని దక్కించుకోగా, అక్కడి నుంచి వచ్చే భక్తులు బమ్మెర, వల్మిడి ప్రాంతాలను సైతం సందర్శిస్తున్నారు. పెండింగ్ పనులు పూర్తి చేసి సరైన వసతులు, సౌకర్యాలు మెరుగుపరచాల్సి ఉంది.



పురోగతి కనిపించని స్మారక కేంద్రం

పర్యాటక కేంద్రాలుగా విరాజిల్లేలా కృషి..

- మామిడాల యశస్విని రెడ్డి, పాలకుర్తి ఎమ్మెల్యే

గత గుత్తేదారుల నిర్లక్ష్యం వల్లే పర్యాటకాభివృద్ధి పనులు అర్ధాంతరంగా ఆగిపోయాయి. పనుల పురోగతి, ప్రతిపాదనలను ప్రభుత్వానికి నివేదించి, త్వరితగతిన జరిగేలా చర్యలు తీసుకుంటాం. రానున్న రోజుల్లో పాలకుర్తి, బమ్మెర, వల్మిడి ప్రాంతాలను పర్యాటక కేంద్రాలుగా విరాజిల్లేలా కృషి చేస్తా.



అసంపూర్తిగా ఆడిటోరియం నిర్మాణం..

విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు



అధికారులకు సూచనలు చేస్తున్న అదనపు కలెక్టర్ పింకేశ్‌కుమార్

నర్మెట్ట, న్యూస్‌టుడే: వైద్యాధికారులు, సిబ్బంది సమయపాలన పాటించాలని, విధులపట్ల నిర్లక్ష్యం వహిస్తే తగు చర్యలు ఉంటాయని అదనపు కలెక్టర్ పింకేశ్‌కుమార్ హెచ్చరించారు. బుధవారం స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని డీఎంహెచ్‌వో రవీందర్ గౌడ్‌తో కలిసి ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పీహెచ్‌సీలోని ఔషధ నిల్వలు, వ్యాక్సిన్ల నిల్వలు, పలు రికార్డులను పరిశీలించారు. రోగులకు నిరంతరం అందుబాటులో ఉండి మెరుగైన సేవలందించాలని సూచించారు. ఏమైనా సమస్యలు ఉంటే అధికారుల దృష్టికి తీసుకువచ్చి, పరిష్కరించుకోవాలన్నారు. దవాఖానాలో సిబ్బంది, నిధుల కొరత ఉందని వైద్యులు వివరించగా, పరిశీలిస్తామన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో అరవింద్‌చౌదరి, వైద్యాధికారిణి రవళి స్నెల్లా, పంచాయతీ కార్యదర్శి కె.శ్రీధర్, తదితరులు పాల్గొన్నారు.

మౌలిక సదుపాయాలు కల్పించండి..

తరిగొప్పుల, న్యూస్‌టుడే: అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులకు మౌలిక సదుపాయాలు కల్పించాలని అదనపు కలెక్టరు పింకేశ్‌కుమార్ అన్నారు. బుధవారం తరిగొప్పుల మండలంలోని బొంతగట్టునాగారం అంగన్‌వాడీ కేంద్రాన్ని ఆయన సందర్శించి, మాట్లాడారు. కార్యక్రమంలో మహిళ శిశు సంక్షేమశాఖ జిల్లా అధికారి ఫ్లోరెన్స్, పీఆర్‌డీఈ శ్రీనివాస్, సీడీపీవో రమాదేవి, ఐసీడీఎస్ సూపర్‌వైజరు రంగమ్మ, పీఆర్‌ఏఈ ప్రదీప్, ఎంపీడీవో దేవేందర్, తదితరులు పాల్గొన్నారు.

భారాస హయాంలోనే కులవృత్తులకు పెద్దపీట



బొమ్మకూర్ జలాశయంలో చేపపిల్లలను వదులుతున్న ఎమ్మెల్యే పల్లారాజేశ్వర్‌రెడ్డి

నర్మెట్ట, న్యూస్‌టుడే: గత భారాస ప్రభుత్వ హయాంలోనే కులవృత్తులకు పెద్దపీట వేశామని, మత్స్యకారుల జీవితాల్లో వెలుగులు నింపిన ఘనత మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌కే దక్కుతుందని జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని మల్లన్నగండి, బొమ్మకూర్ జలాశయాల్లో మత్స్యశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత చేపపిల్లల పంపిణీ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై గంగమ్మతల్లికి ప్రత్యేక పూజలు చేసి, చేపలను వదిలారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. నియోజకవర్గంలో 29.5లక్షల పిల్లలను వదలాలని ప్రభుత్వం నిర్ణయించిందని, గత సంవత్సరం 60 లక్షలు వదిలామని తెలిపారు. కార్యక్రమంలో డీఎఫ్‌వో రాణాప్రతాప్, జిల్లా మత్స్యశాఖ అధ్యక్షులు నీల రాజు, డైరెక్టర్లు సంపత్, స్వామి, యాదయ్య, రాజు, భారాస నాయకులు పాల్గొన్నారు.

గీత కార్మికులకు అండగా 'కాటమయ్య కిట్'

జనగామ టౌన్: కల్లుగీత కార్మికులకు ప్రభుత్వం మంజూరు చేసిన కాటమయ్య రక్షణ కిట్లను జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి బుధవారం తన క్యాంపు కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో 25 మందికి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కార్మికులు తాటి చెట్ల పైనుంచి ప్రమాదవశాత్తు పడినప్పుడు మరణాలు, గాయాలు సంభవించకుండా ఈ కిట్లు దోహదపడుతాయని సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్‌పర్సన్ పి.జమున, ఎక్సైజ్ సీఐ ప్రభావతి, ఎస్సై జనార్దన్, వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ జిల్లా అధికారి రవీందర్, గౌడ సంఘం నాయకులు వెంకటమల్లయ్య, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

చెట్టుకొమ్మల తొలగింపు



లింగాలఘనపురం, న్యూస్‌టుడే: జనగామ నుంచి పాలకుర్తి వెళ్లే ప్రధాన రహదారిలో దూరాన్ని తెలిపే సూచిక బోర్డు కనిపించకుండా చెట్ల కొమ్మలు కప్పివేశాయి. సమస్యను 'న్యూస్‌టుడే' అధికారుల దృష్టికి తీసుకెళ్లడంతో స్పందించి చెట్ల కొమ్మలు తొలగించారు. గ్రామాల పేర్లు.. దూరం స్పష్టంగా కనిపిస్తున్నాయి.

పైపులైన్‌కు మరమ్మతు

పాలకుర్తి: మండల కేంద్రంలోని అంగడి బజార్లో మిషన్ భగీరథ పైపులైనుకు లీకేజీ కావడంతో తాగునీరు వృథాగా పోతున్నాయని రాజు అనే వ్యక్తి మేమున్నాం.. మీకు తోడుగాకు వివరించారు. సమస్యపై పంచాయతీ కార్యదర్శి వెంకటేశ్వరచారి స్పందించి సిబ్బందితో మరమ్మతు చేయించారు.

సమస్యల పరిష్కారానికి పాలనాధికారికి వినతి



జనగామ, న్యూస్‌టుడే: జిల్లాలోని వివిధ సమస్యలను పరిష్కరించాలని, కేంద్ర ప్రభుత్వ పథకాల అమలుకు చర్యలు తీసుకోవాలని భాజపా జిల్లా అధ్యక్షుడు ఆరుట్ల దశమంతరెడ్డి ఆధ్వర్యంలో బుధవారం జనగామ జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు. జిల్లా ప్రభుత్వ వైద్యాలయంలో సీటీ స్కాన్ ఏర్పాటు చేయాలని, సంజయ్‌నగర్ సమీపంలో ఆదర్శ మార్కెట్ నిర్మాణాన్ని పూర్తి చేయాలని, పీఎం విశ్వకర్మ పథకం లబ్ధిదారులకు జనగామలోనే శిక్షణ కేంద్రాలను ఏర్పాటు చేయాలని కోరారు. ఇందిరమ్మ కమిటీల్లో ఒక రాజకీయ పార్టీ వారిని కాకుండా అర్హత కలిగిన అన్ని వర్గాల వారిని నియమించాలని కోరారు. లేని పక్షంలో భాజపా ఆధ్వర్యంలో ప్రజాందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు ఊడ్గుల రమేశ్, సౌడ రమేశ్, మహంకాళి హరిశ్చంద్రగుప్త, కొంతం శ్రీనివాస్‌లు పాల్గొన్నారు.

పాలనాధికారిని కలిసిన విస్తరణాధికారులు..


జనగామ: పొరుగుసేవల విధానంలో జిల్లాలో పనిచేస్తున్న వ్యవసాయ విస్తరణాధికారుల సంఘం ఆధ్వర్యంలో ప్రతినిధులు బుధవారం జిల్లా కలెక్టర్ రిజ్వాన్‌బాషాను కలిసి తమ సమస్యలను విన్నవించారు. సమాన పనికి సమాన వేతనం, ఉద్యోగ భద్రత, జీవిత బీమా సదుపాయం కల్పించి, నెల నెలా సక్రమంగా వేతనాలు వచ్చేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

వేతనాలు చెల్లించాలని కలెక్టరేట్ ఎదుట ధర్నా



జనగామ, న్యూస్‌టుడే: జిల్లా కేంద్రంలోని ఎంసీహెచ్ ఆసుపత్రి, వైద్య కళాశాల సిబ్బంది తమకు ఏడు మాసాల నుంచి వేతనాలు రావడం లేదని, చెల్లింపుల జాప్యంపై సదరు గుత్తేదారుపై చర్యలు తీసుకోవాలని కోరుతూ జిల్లా సమీకృత కార్యాలయం ఎదుట వారు ధర్నా నిర్వహించారు. సీఐటీయూ ఆధ్వర్యంలో బుధవారం జరిగిన ధర్నాను ఉద్దేశించి ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు రాపర్తి రాజు మాట్లాడారు. వారం రోజుల్లో పెండింగ్ వేతనాలు చెల్లించాలని, లేని పక్షంలో నిరవధిక సమ్మెకు దిగుతామన్నారు. డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని జిల్లా కలెక్టర్‌కు అందించినట్లు ప్రకటించారు. కార్యక్రమంలో సిబ్బంది రేష్మ, రామ్దయాకర్, రఘు, గోపాల్, సంపత్, కళ్యాణి, రజిత ఇతరులు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి



గానుగుపహాడ్‌లో కేంద్రాన్ని ప్రారంభిస్తున్న మార్కెట్ ఛైర్మన్ శివరాజ్‌యాదవ్, అధికారులు

జనగామ రూరల్, న్యూస్‌టుడే: ధాన్యానికి మద్దతు ధర కల్పించాలనే సంకల్పంతో రాష్ట్ర ప్రభుత్వం గ్రామాల్లో ఏర్పాటు చేస్తున్న ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని జనగామ మార్కెట్ కమిటీ ఛైర్మన్ బనుక శివరాజ్‌యాదవ్ అన్నారు. బుధవారం మండలంలోని గానుగుపహాడ్, పెంబర్తి గ్రామాల్లో పీఏసీఎస్-చీటకోడూరు, జనగామ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కేంద్రాలను ప్రారంభించి, మాట్లాడారు. కార్యక్రమంలో పీఏసీఎస్ ఛైర్మన్లు మహేందర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, మాజీ సర్పంచి అంబాల ఆంజనేయులు, నాయకులు లింగాల నర్సిరెడ్డి, సుంకరి శ్రీనివాస్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

19న మెగా వైద్య శిబిరం

జనగామ, న్యూస్‌టుడే: చంపక్‌హిల్స్‌లోని మాతృదేవోభవ ట్రస్ట్, జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు, నిమ్స్ మాజీ డైరెక్టర్ డాక్టర్ దాసరి ప్రసాద్ ఆధ్వర్యంలో అపోలో స్పెక్ట్రా ఆసుపత్రుల సౌజన్యంతో ఈ నెల 19న గుండె ఆరోగ్య మెగా పరీక్ష శిబిరాన్ని నిర్వహించనున్నట్లు జేవీవీ రాష్ట్ర కార్యదర్శి ఆకుల శ్రీనివాసరావు తెలిపారు. చంపక్‌హిల్స్‌లోని మాతృదేవోభవ ట్రస్టు ప్రాంగణంలో జరిగే శిబిరాన్ని అవసరార్థులు వినియోగించుకోవాలని కోరారు. శిబిరం వివరాల ప్రచార పత్రికలను బుధవారం స్థానిక జేవీవీ కార్యాలయంలో ఆవిష్కరించారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు బానోతు రవీందర్, ప్రధాన కార్యదర్శి అనంతోజు ఉమాదేవి, ట్రస్టు ప్రతినిధి ఎన్.చంద్రశేఖర్ ఇతరులు పాల్గొన్నారు.

నాణ్యమైన విద్యుత్తు సరఫరాకు కృషి



విద్యుత్తు కేంద్రాన్ని పరిశీలిస్తున్న డీఈ రాంబాబు

స్టేషన్‌ఘన్‌పూర్, న్యూస్‌టుడే: విద్యుత్తు సరఫరాలో వినియోగదారులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా నాణ్యమైన విద్యుత్తును అందించాలని డీఈ వై.రాంబాబు సిబ్బందికి సూచించారు. స్థానిక విద్యుత్తు కేంద్రాన్ని బుధవారం ఆకస్మికంగా సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. సిబ్బంది నిత్యం వినియోగదారులకు అందుబాటులో ఉంటూ.. విధుల్లో నిర్లక్ష్యం వహించకుండా విద్యుత్తు సరఫరాలో భద్రత ప్రమాణాలు పాటిస్తూ జాగ్రత్తలు తీసుకోవాలని చెప్పారు. అనంతరం చిల్పూర్ మండల కేంద్రంలోని విద్యుత్తు ఉప కేంద్రాన్ని సందర్శించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఏడీఈ వంశీకృష్ణ, ఏఈ లక్ష్మీనారాయణ, సబ్ ఇంజినీరు వినీత్ రెడ్డి, లైన్ ఇన్‌స్పెక్టర్ ఐలయ్య, లైన్‌మెన్‌లు పాల్గొన్నారు.

పాలకుర్తి: నాణ్యమైన విద్యుత్తు సరఫరాకు సిబ్బంది, అధికారులు మరింత అంకితభావంతో పని చేయాలని స్టేషన్‌ఘన్‌పూర్ డీఈ రాంబాబు సూచించారు. బుధవారం ఆయన పాలకుర్తిలోని విద్యుత్తు సబ్‌స్టేషన్‌ను తనిఖీ చేసి, సరఫరాపై ఆరా తీశారు. సరఫరాలో హెచ్చుతగ్గులు, ఇతరాత్ర సమస్యల పరిష్కారంలో తీసుకోవాల్సిన అంశాలపై సలహాలు, సూచనలిచ్చారు. విధుల పట్ల సిబ్బంది నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదన్నారు. కార్యక్రమంలో ఇన్‌ఛార్జి ఏడీ రణధీర్, ఏఈలు సత్తయ్య, రాములు, సబ్ ఇంజినీర్లు రాంబాబు, రాకేశ్, సిబ్బంది పాల్గొన్నారు.

నిబంధనల మేరకే ధాన్యం కొనుగోళ్లు



గోవర్ధనగిరిలో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న అదనపు కలెక్టర్ రోహిత్ సింగ్

రఘునాథపల్లి, న్యూస్‌టుడే: వానాకాలం ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తున్న నేపథ్యంలో నిర్వాహకులు, రైతులు నిబంధనలను పాటించాలని అదనపు కలెక్టర్ రోహిత్ సింగ్ అన్నారు. గోవర్ధనగిరిలో బుధవారం మహిళా సంఘాల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. కేంద్రాల నిర్వాహకులు, వ్యవసాయ క్షేత్రాధికారులు సమన్వయంతో వరుస క్రమంలో రైతులకు టోకెన్లు ఇవ్వాలని చెప్పారు. విక్రయించిన రైతులకు వెంటనే డబ్బులు ఖాతాల్లో జమయ్యేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. రైతులు ధాన్యాన్ని ఆరబెట్టి తూర్పార పట్టాకే కేంద్రానికి తీసుకురావాలని, తేమ 17 శాతం ఉండేలా సరిచూసుకోవాలని తెలిపారు. సన్నాలకు ప్రభుత్వం రూ.500 బోనస్ ఇస్తున్నందున సద్వినియోగం చేసుకోవాలని వివరించారు. కార్యక్రమంలో డీఆర్డీవో వసంత, సివిల్ సప్లై డీఎం హథీరాం, డీపీఎం రాజేంద్ర ప్రసాద్, డీసీఎస్‌వో సరస్వతి, తహసీల్దార్ మోహిసిన్, ఎంపీడీవో శ్రీనివాస్, మండల వ్యవసాయ అధికారి శ్రీనివాస్ రెడ్డి పాల్గొన్నారు.

రైతులకు ఇబ్బందులు రావొద్దు

స్టేషన్‌ఘన్‌పూర్: కొనుగోలు కేంద్రాలకు ధాన్యం తీసుకొచ్చే రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా కేంద్రం నిర్వాహకులు చూడాలని జిల్లా అదనపు కలెక్టర్ రోహిత్ సింగ్ అన్నారు. మండలంలోని శివునిపల్లిలో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. కొనుగోలు కేంద్రం నిర్వాహకులు ప్రభుత్వ నిబంధనల ప్రకారం ధాన్యానికి సంబంధించి అన్ని వివరాలతో కూడిన సమాచారాన్ని సూచిక బోర్డుల ద్వారా ఏర్పాటు చేయాలని సూచించారు. కార్యక్రమంలో మార్కెట్ ఛైర్మన్ లావణ్య, డీఆర్డీవో వసంత, సివిల్ సప్లై డీఎం సరస్వతి, మార్కెటింగ్ డీఎం హథీరాం, ఏపీఎం కుమార్, తహసీల్దార్ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గం

ఉద్యమకారుడు రాంబ్రహ్మం మృతి



రాంబ్రహ్మం(పాతచిత్రం)

లింగాలఘనపురం: తెలంగాణ రాష్ట్ర సాధనోద్యమకారుడు మాణిక్యపురానికి చెందిన ముమ్మాడి రాంబ్రహ్మం(50) బుధవారం మృతి చెందారు. ఆయన కొంతకాలంగా అనారోగ్యంతో చికిత్స పొందుతున్నారు. మాజీ ఎమ్మెల్యే రాజయ్య మాణిక్యపురంలో రాంబ్రహ్మం మృతదేహంపై పూలమాల వేసి నివాళి అర్పించారు. పూర్ణచందర్, భాగ్యమ్మ, ఆంజనేయులు, శ్రీహరి, పరశురాములు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి



జఫర్‌గఢ్: పెండింగ్‌లో ఉన్న కరవుభత్యం వెంటనే విడుదల చేయాలని కోరుతూ పీఆర్టీయూ, డీటీఎఫ్ శాఖల ప్రతినిధులు, ఉపాధ్యాయులు తమ్మడపల్లి(జి) పాఠశాలలో బుధవారం జేబులకు నల్లబ్యాడ్జీలు పెట్టుకుని నిరసన వ్యక్తం చేశారు. పీఆర్టీయూ, డీటీఎఫ్ మండల కమిటీ అధ్యక్షులు సీతారామయ్య, సురేష్ మాట్లాడుతూ 2022 నుంచి ఉద్యోగులకు, ఉపాధ్యాయులకు కరవు భత్యం ఇవ్వకుండా ప్రభుత్వం మభ్యపెడితే. . ప్రస్తుత ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని చెప్పారు. 5 డీఏలు ఏకమొత్తంగా ఇవ్వాలని డిమాండ్ చేశారు. నిరసన కార్యక్రమంలో మాధవరావు, ఆరోగ్యరెడ్డి, సంపత్‌కుమార్ పాల్గొన్నారు.

నూతన విద్యా విధానాలను పాటించాల్సిందే..



ఉపాధ్యాయులకు సూచనలు చేస్తున్న జిల్లా విద్యాశాఖాధికారి కె.రాము

రఘునాథపల్లి: ప్రభుత్వం పాఠశాలల్లో అమలు చేస్తున్న విద్యా విధానాలను ఉపాధ్యాయులు విధిగా పాటించాలని జిల్లా విద్యాశాఖాధికారి కె.రాము అన్నారు. రఘునాథపల్లి ఉన్నత పాఠశాల, మండల విద్యా వనరుల కేంద్రాన్ని బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. తరగతుల వారీగా సందర్శించి ఉపాధ్యాయుల బోధనను ప్రత్యక్షంగా తిలకించారు. పదో తరగతి విద్యార్థులపై ఇప్పటి నుంచే శ్రద్ధ చూపాలన్నారు. కార్యక్రమంలో మండల విద్యాశాఖాధికారి రఘునందన్ రెడ్డి, ప్రధానోపాధ్యాయుడు ఉపేందర్ పాల్గొన్నారు.

శాంతిభద్రతలకు భంగం కలిగిస్తే ఉపేక్షించేది లేదు

చిల్పూర్: స్టేషన్‌ఘన్‌పూర్ పోలీస్ సబ్ డివిజన్ పరిధిలో శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే ఉపేక్షించేది లేదని ఏసీపీ ఆర్.భీమ్‌శర్మ హెచ్చరించారు. మండలంలోని చిన్నపెండ్యాలలో సబ్ డివిజన్ పోలీసుల ఆధ్వర్యంలో బుధవారం రాత్రి కట్టడి ముట్టడి కార్యక్రమం నిర్వహించారు. అనుమతి పత్రాలు లేని నాలుగు ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకొని.. ఏడు వాహనాలకు రూ.1750 జరిమానా విధించారు. అక్రమంగా మద్యం విక్రయిస్తున్న రాంచంద్రు, గుండెల్లి రాజుల నుంచి రూ. 7,820 విలువ చేసే అక్రమ మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. పేరాల కుమార్ అనే వ్యక్తి వద్ద అక్రమంగా విక్రయిస్తున్న రూ.4700 విలువైన అంబర్ ప్యాకెట్లను సీజ్ చేసి కేసులు నమోదు చేశారు. అనంతరం గ్రామస్థులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఏసీపీ మాట్లాడుతూ. . తల్లిదండ్రులు మైనర్లకు ద్విచక్ర వాహనాలు ఇవ్వకూడదని చెప్పారు. కార్యక్రమంలో జనగామ రూరల్ సీఐ శ్రీనివాస్‌రెడ్డి, ఎస్సైలు నవీన్‌కుమార్, శ్రావణ్‌కుమార్, నరేష్, రమేష్ పాల్గొన్నారు.

ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాటం



మాట్లాడుతున్న కనకారెడ్డి

బచ్చన్నపేట, న్యూస్‌టుడే: ప్రజా వ్యతిరేక విధానాలపై సీపీఎం తరపున నిరంతర పోరాటం చేయాలని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి మోకు కనకారెడ్డి అన్నారు. గురువారం బచ్చన్నపేట మండలం గోపాల్‌నగర్‌లో కార్యకర్తలతో సమావేశం నిర్వహించి, జెండావిష్కరణ చేశారు. ఈ సందర్భంగా కనకారెడ్డి మాట్లాడుతూ.. ఎన్నికల్లో ప్రజలకిచ్చిన వాగ్దానాలను నెరవేర్చాలని పాలక ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. బచ్చన్నపేట మండలం చిన్నరామన్‌చర్ల శివారు సర్వేనంబరు 174లో గుడిసెలు వేసుకున్న గుడిసెవాసులకు పట్టాలివ్వాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా కమిటీ సభ్యుడు విజేందర్, మండల కార్యదర్శి వెంకటేశ్, నాయకులు పాల్గొన్నారు.

రైతులు అప్రమత్తంగా ఉండాలి



నర్మెట్ట, న్యూస్‌టుడే: పశువులకు సంక్రమిస్తున్న గాలికుంటు వ్యాధుల పట్ల కర్షకులు అప్రమత్తంగా ఉండాలని జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి డాక్టర్ వై. రాధాకిషన్ రైతులకు సూచించారు. బుధవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకా కార్యక్రమాన్ని ఆయన సందర్శించి మండల పశువైద్యాధికారిణి నేహాను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. నర్మెట్టలో సుమారు 180 పశువులకు టీకాలు వేసి వ్యాధితో కలిగే అనర్థాలను గురించి వివరించారు. కార్యక్రమంలో సహాయ సంచాలకులు డాక్టర్ నర్సయ్య, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

బకాయిలు విడుదల చేయాలని నిరసన

స్టేషన్‌ఘన్‌పూర్, న్యూస్‌టుడే: ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయకుండా విద్యార్థులను రాష్ట్ర ప్రభుత్వం ఇబ్బందులకు గురి చేస్తోందని ఏఐఎస్ఎఫ్, ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో నాయకులు బుధవారం నిరసన వ్యక్తం చేశారు. స్థానిక విద్యాజ్యోతి కళాశాల నుంచి అంబేడ్కర్ విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించి నిరసన చేపట్టారు. అనంతరం నాయకులు మాట్లాడుతూ.. మూడేళ్లుగా పెండింగ్‌లో ఉన్న ఫీజులను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో విద్యాజ్యోతి కళాశాల ప్రిన్సిపల్ థామస్ కిరణ్, నాయకులు యూనుస్, యాకన్న రాథోడ్ పాల్గొన్నారు.

హోంగార్డు మృతిపట్ల పోలీసుల సంతాపం



నివాళులర్పిస్తున్న సీఐ మహేందర్‌రెడ్డి, ఎస్సై రాజు

కొడకండ్ల, న్యూస్‌టుడే: కొడకండ్ల పోలీస్‌స్టేషన్ పరిధిలోని హోంగార్డు గుండెపోటుతో ఆకస్మికంగా మృతిచెందడంతో పాలకుర్తి సీఐ మహేందర్‌రెడ్డి, ఎస్సై రాజు బుధవారం మృతదేహానికి నివాళులర్పించారు. పదేళ్లుగా విధులు నిర్వర్తిస్తున్న మహ్మద్ గౌస్‌పాషా(52) బుధవారం తెల్లవారు జామున ఇంటికి వెళ్లారు. కొద్ది సేపటికే కుప్పకూలి ఆకస్మికంగా మృతిచెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఆయన మృతిపట్ల స్టేషన్‌లో రెండు నిమిషాలు మౌనం ప్రకటించారు. అంత్యక్రియలకు ప్రజలు అధిక సంఖ్యలో తరలివచ్చారు.

అమ్మవారి సేవలో బాలలక్ష్మి



జనగామ టౌన్, న్యూస్‌టుడే: జనగామ పట్టణంలోని బతుకమ్మకుంట దుర్గామాత దేవాలయ వార్షికోత్సవాల్లో బుధవారం రాష్ట్ర బీసీ కమిషన్ సభ్యురాలు రంగు బాలలక్ష్మి పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గ్రామీణ దేవతల పండగలు ఆధ్యాత్మికతతో పాటు ఐక్యతను పెంచుతాయన్నారు. కార్యక్రమంలో నాయకులు లొక్కుంట్ల ప్రవీణ్, జాయ మల్లేష్, మోర్తాల ప్రభాకర్, అభిగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

పట్టపగలే నగదు చోరీ



స్టేషన్‌ఘన్‌పూర్‌లో ఓ దుకాణంలో సీసీ కెమెరాలను పరిశీలిస్తున్న సీఐ వేణు

స్టేషన్‌ఘన్‌పూర్, న్యూస్‌టుడే: బ్యాంకులో నుంచి తీసుకున్న నగదును ద్విచక్రవాహన కవర్లో పెట్టగా పట్టపగలే చోరీకి గురైన ఘటన మండల కేంద్రంలో బుధవారం చోటుచేసుకుంది. పోలీసులు, బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం.. జఫర్‌గఢ్ మండలంలోని తిమ్మంపేట గ్రామానికి చెందిన మంద రాజు అనే రైతు ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం రైతు రుణమాఫీ చేయడంతో మండలంలోని శివునిపల్లి బరోడా బ్యాంకుకు వెళ్లి బుధవారం రూ.లక్ష 10 వేలు తీసుకొని.. అక్కడి నుంచి మండల కేంద్రంలోని యూనియన్ బ్యాంక్‌లో గృహ రుణం సంబంధించి రూ.2 లక్షల నగదు తీసుకొని బండి కవర్‌లో పెట్టుకొని వెళ్తున్నాడు. ఈ క్రమంలో మండల కేంద్రంలోని ఓ బుక్‌స్టాల్ వద్ద ఆగి పుస్తకాలు తీసుకొని వచ్చేసరికి బండిలో పెట్టుకున్న రూ.3 లక్షల 10 వేల నగదును గుర్తు తెలియని వ్యక్తులు ద్విచక్రవాహనంపై వచ్చి అపహరించారు. వెంటనే బాధితుడు లబోదిబోమంటూ పోలీసులకు ఫిర్యాదు చేయగా వారు ఘటన స్థలానికి చేరుకొని సీసీ కెమెరాలను పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బడికి గేటు అందజేత



పాలకుర్తి, న్యూస్‌టుడే: మండలంలోని వావిలాల ప్రభుత్వ పాఠశాలకు మహాత్మ హెల్పింగ్ హ్యాండ్స్ సంస్థ రూ.2.50 లక్షల విలువైన గేటును బుధవారం అందజేసింది. సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు గంటా రవీందర్ తన తండ్రి సోమనర్సయ్య పేరిట అందజేశారు. అలాగే గతంలో సుమారు రూ.లక్షన్నరతో ప్రత్యేక వేదిక ఏర్పాటుతో పాటు ప్రహరీ గోడలపై ఆకర్షణీయంగా బొమ్మలను గీయించారు. అప్పుడు ఇచ్చిన మాట మేరకు గేటు అందజేశామని రవీందర్ పేర్కొన్నారు.

కరపత్రాల ఆవిష్కరణ



పాలకుర్తి, న్యూస్‌టుడే: విద్యా పరిరక్షణ కమిటీ జిల్లాస్థాయి సమావేశం బుధవారం మండల కేంద్రంలోని విద్యా వనరుల కేంద్రంలో నిర్వహించారు. రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఈ సమావేశాన్ని ఏర్పాటు చేసినట్లు మండల కమిటీ బాధ్యులు చిదురాల శ్రీనివాస్ తెలిపారు. కార్పొరేట్ బడుల వ్యవస్థను ప్రోత్సహించే విద్యా విధానాలను రద్దు చేసి, సర్కారీ విద్య బలోపేతం కోసం చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం ఈనెల 20న జిల్లాలో జరిగే సమావేశం కరపత్రాలను మండల విద్యాధికారి పోతుగంటి నర్సయ్య ఉపాధ్యాయులతో కలిసి ఆవిష్కరించారు. కార్యక్రమంలో సంఘం ప్రతినిధులు వెంకట నర్సయ్య, ఎండీ షరీఫ్, శ్రీనివాసు, సూర్యాప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు.

ద్విచక్రవాహనాల అపహరణలో ఒకరి అరెస్టు

కొడకండ్ల, న్యూస్‌టుడే: ద్విచక్రవాహనాల చోరీకి పాల్పడుతున్న ఒకరిని అరెస్టు చేసి బుధవారం రిమాండ్‌కు తరలించినట్లు పాలకుర్తి సీఐ మహేందర్‌రెడ్డి, కొడకండ్ల ఎస్సై రాజు తెలిపారు. వారు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. జనగామ జిల్లా దేవరుప్పుల మండలం సింగరాజుపల్లిలో ఆరు నెలల కింద ఒకటి, ఈనెల 12న కొడకండ్ల మండలం మొండ్రాయిలో మరో ద్విచక్రవాహనం చోరీ అయినట్లు బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదైందన్నారు. దర్యాప్తు చేస్తుండగా, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని తూర్పుగోదావరి జిల్లా గోపాలపురం మండలం బీమోలు గ్రామానికి చెందిన గంగరాజు(31) అనే నిందితుడు అపహరించినట్లు నిర్ధారణ కావడంతో పట్టుకున్నామని చెప్పారు. నిందితుడిని త్వరితగతిన పట్టుకోవడంతో సిబ్బందిని వారు అభినందించారు.



కొనుగోళ్ల ప్రక్రియ

మూడో కవర్‌షెడ్ ప్రారంభం

ఈనాడు కథనానికి స్పందన

జనగామ, న్యూస్‌టుడే: 'పంట చేతికొచ్చే.. విక్రయాల్లో తిప్పలాయె' శీర్షికన 'ఈనాడు'లో బుధవారం ప్రచురితమైన కథనానికి జిల్లా మార్కెటింగ్ అధికారి నరేందర్, మార్కెట్ కార్యదర్శి శ్రీనివాస్‌లు స్పందించారు. జనగామ మార్కెట్‌కు పెద్ద ఎత్తున ధాన్యం వస్తున్న తరుణంలో మూడో కవర్‌షెడ్ నిరుపయోగంగా ఉన్న తీరుపైన, రైతులు గంటల కొద్ది మార్కెట్ బయట అవస్థలు పడుతున్న వైనాన్ని కథనంలో వివరించడంతో అధికారులు చర్యలు చేపట్టారు. మూడో కవర్‌షెడ్లో క్రయ, విక్రయాలు జరిపారు. ధాన్యం వాహనాలు పెద్ద సంఖ్యలో రావడంతో నేరుగా యార్డులోనికి అనుమతించారు.